# రోత



చెరువు గట్టుమీద నడుస్తున్నారు. పార్వతీ, కళావతీ ఇద్దరే.

కృష్ణప్ప గుర్తుకు వస్తున్నాడు పార్వతికి.

చల్లగా ప్రశాంతంగా ఉంది సాయంత్రం.

ప్రకృతి పేదరికంగానూ, నిరాడంబరంగానూ, విశాలంగానూ ఉంది.

పార్వతి టీచర్. కొత్తగా నెలదినాల క్రితమే ఉద్యోగంలో చేరింది. చేరినదినంనించి ఆమెకు పొరుగూరు 'సీమ' చూడాలని ఉంది. సీమలో తన చిన్నప్పుడు మూడేళ్ళు ఉంది. పార్వతి నాన్నగారు ఫిర్కా రెవెన్యూ ఇనస్పెక్టరుగా ఉండేవారు. ఆయన తరవాత తరవాత డెప్యూటీ తహసీల్దారయి, ఇప్పుడు రిటైరయ్యారు. ప్రస్తుతం తల్లీ తండ్రీ తమ్ముడూ పట్టణంలో సంపాదించుకున్న ఇంటిలో ఉంటున్నారు. తమ్ముడి కాలేజీ చదువు పూర్తి అవటానికి ఇంకా ఒక ఏడాది ఉంది.

పెద్దన్నయ్య హైదరాబాదులో, చిన్నన్నయ్య జాజ్‌పూర్‌లో ఉద్యోగాలయితే చేస్తున్నారు కాని వాళ్ళకు వాళ్ళ సంసారాలు ఈదుకోవడమే కష్టంగా ఉంది. నాన్నగారికి వస్తున్నది బొత్తిగా చాలటంలేదు. అసలే చిన్న ఇల్లు అయినప్పటికీ ఒక భాగాన్ని అద్దెకిచ్చారు. కొడుకులను అడగడం ఆతడికి ఇష్టం లేదు. కూతురు చదువుకుని, వయసువచ్చి పెళ్లికాక ఇంట్లో ఉండిపోయిందనే బెంగ దానికి తోడు. సుమారు మూడు నాలుగేళ్ళు వృథాగా ఇంట్లో కూర్చుని చివరికి కూర్చోలేక బి. ఇడి. ట్రెయినింగ్ అయింది. పట్టణం రోత అయింది. ఏ పల్లెటూరికన్నా తన్ని ఎవరూ ఎరగని చోటుకు పారిపోవాలనిపించింది. జిల్లాపరిషత్తులకు అప్లికేషన్ పెట్టుకుంది. ఆర్డర్స్ వచ్చాయి. నాన్నగారు చూసి "సీమ దగ్గిరే ఉంది పెదపేట. గుర్తుందా?" అని గుర్తుకు తెచ్చారు.

అక్టోబరు నెల అయినప్పటికీ పొలాల్లో చేలు అందంగా లేవు. కాలవల్లో నీళ్ళు నిండుగా లేవు. దారిలో కలిసిన మనుషులు ఆరోగ్యంగా లేరు. బంజర్లలోనూ, చెరువు కడుపుల్లోనూ మేసుకుంటున్న పశువులు బలంగా లేవు. దట్టంగా చెట్లు లేవు. మట్టి సారవంతంగా అందంగా లేదు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుని నడుస్తున్నారు గట్ల దారిని.

కళావతి పదిహేనేళ్ల పిల్ల. ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతూంది. ఆ అమ్మాయిది సీమ. క్లాసులో పిల్లల్లో కొంచెం నాజూకుతనం తెలిసిన పిల్ల. వాళ్ళ నాన్నగారు చాలాకాలం టాటానగర్‌లో పనిచేశారు. అక్కడే ఉండేది. అందుకే ఆ అమ్మాయికి హిందీలో ఫస్టుమార్కులు వస్తున్నాయి. కళావతితో "మీ ఊరు చూడాలని ఉంది. వస్తా" నని చెప్పింది. "రండి మేడమ్" అని చాలాసార్లు ఆ అమ్మాయి పిలిచింది. పార్వతి 'వెళతాను, వెళ్లాలి, ఈ రోజుకూడా వెళ్లలేకపోయానే!' అనుకుంటూ, 'వెళ్లలేకపోతున్నానే' అని బాధపడుతూండగానే నెలదినాలు గడిచిపోయాయి.

చివరికి ఎట్లాగయితేనేం ఈనాటికి—

లోకం విశాలంగా ఉంది. కాంతి కరుణాత్మకంగా ఉంది. ప్రకృతి తియ్యగా ఉంది. చల్లగాలులు ఉల్లా




సంగా ఉన్నాయి. దానితో స్వేచ్ఛగా ఉన్నట్లుంది పార్వతికి.

ఆమె బాల్యం అంతా అస్పష్టంగా కనబడుతున్న రంగుల బొమ్మల్లాగ కళ్లముందు కదలాడింది. ఏడునించి పదివరకూ గడిచిన ఆమె బాల్యం సీమను అంటిపెట్టు కుంది. చిన్ననాటి రోజులు ఆమెకు ఎంతో తియ్యగా ఉంటున్నాయి. చిల్లరిగా గాలితనంతో తన ఈడు పిల్ల లందరితోనూ తిరిగేది. ఆడుకునేది. పాడుకునేది. ఎవరికీ చిక్కకుండా పరుగులు తీసేది. ఇల్లూ, వాకిలీ, తల్లీతండ్రీ — అన్నీ అందరినీ మరిచిపోయేది. కృష్ణప్ప, సాంబయ్య, లోలాక్షి—అబ్బ ఎంతమందో!—వాళ్ల పేర్లు మరిచిపోయిందిప్పుడు. ఎంతో ప్రేమతో స్నేహంతో వెతుకుతో చూసేవారు. కలల్లో కూడా వాళ్లే. కళ్ళు తెరిచినా మూసినా కోనేటి గట్టుమీది అంజనేయ స్వామి గుడి మంటపమే. అక్కడి రావిచెట్టు నీడలో రోజు రోజంతా గడిచిపోయేది. గురయ్య భోజనాల వేళకు వచ్చి ఎత్తుకుపోయేవాడు. ఎండల్లో ఏమిటా ఆటలని పెద్దన్నయ్యా అమ్మా తిట్టేవారు.

కోనేటిలో ఆటలాడుకుంటున్నా రంతా. పార్వతికి నీరంటే భయం. ఒడ్డున నిలుచుంది. కొందరు స్నానాలు పూర్తిచేసి ఒడ్డు చేరటానికి సిద్ధంగా ఉన్నారు. కొందరు బట్టలు మార్చుకుంటున్నారు. మిట్ట మధ్యాహ్నపు వేళ. పెద్దలెవ్వరూ కనుచూపుమేరలో కనబడడం లేదు.

తన్ని భయపెట్టడం కృష్ణప్పకు సరదా. కృష్ణప్ప రొమ్ములోతు నీటిలో ఉంటాడు. ఇంకా లోపలికి పోతాడు. వద్దనేది తను. వద్దన్నకొద్దీ లోపలికి వెళ్లేవాడు. తను భయంతో కంట నీరు పెట్టుకునేది. కృష్ణప్ప బయటికి వచ్చేవాడు. తను మాటాడేది కాదు. బతిమాలేవాడు. బాధపడేవాడు. రావిచెట్టు వేరు మీద కూచొని ఎదురుచూస్తుండేవాడు.

ఆ రోజు —

కృష్ణప్ప ఇంకా లోతుకు వెళ్లాడు. ఇంకా...ఇంకా ...

కృష్ణప్ప మునిగిపోయాడు. చూసీచూడడంతోనే పరుగుతీశారు ఎవరిదారిన వాళ్లే. భయంతో కేకవేసింది తను. ఎవరూ కనబడలేదు. చుట్టూ చూసింది. మునుగుతూ తేలుతూ, మునుగుతూ తేలుతూ కనబడుతున్నాడు కృష్ణప్ప. ఎటో చూడా లనుకుంటున్నాడు. కళ్ళు తెరవకమునుపే మునిగి పోతున్నాడు.తరవాత ఎంతకూ తేలలేదు కృష్ణప్ప.మరింక కనిపించలేదు. కృష్ణప్పే కాదు పద్మాల కోనేరుగాని, అంజనేయస్వామి గుడికాని, పైన కొమ్మలు చాచిన రావిచెట్టుగాని, చుట్టూ పెరిగిన పచ్చని చెట్లమధ్య బూడిదరంగు కప్పులతో అంటుకుని సాగిన ఎత్తు పల్లాల పూరిళ్ల పల్లెగాని, నీలాకాశంగాని, సూర్యుడి తీవ్రమయిన వెలుగుగాని, చివరికి తన శరీరంగాని ఏమీ కనిపించలేదు. తరవాత కనిపించిందల్లా తమ ఇంటి పై కప్పూ, తెల్లని పరుపుమీద మంచానికి అంటు కుని తనూ.

కృష్ణప్ప చనిపోయాడు!

సరి, ఆరోజునించి తన్ని బయట అడుగు పెట్ట నివ్వలేదు. ఆ మంచమే తన పంజరం అయిపోయింది. బయటికి వెళ్లటానికి భయం.

కృష్ణప్ప తరవాత కలల్లో కనబడుతూనే ఉండే వాడు. ఆ కలలన్నీ గుర్తులేవు. ఒక్కటిమాత్రం బాగా గుర్తుండిపోయింది.

పసిపిల్లలకు, అందునా ఆడపిల్లలకు పెళ్ళి ఆటలు ఆడుకొనడంలో ఉన్నంత ఆనందం మరి దేనిలోనూ ఉండదు. బాధ్యతగల గృహిణులుగా సంసారాలు చక్కబెట్టి, అందరినీ సంతోషపెట్టి, ఆనందపారవశ్యంలో మునిగి పోతారు. రోజులు ఒక్కలాగ ఉండవు. జీవితాలు వేరువేరు మార్గాలలో సాగిపోతాయి. విడి పోతారు. ఎన్నయినా ఏమైనా చిన్ననాటి ఆ భావ ముద్రల ప్రభావం మాత్రం చెక్కుచెదరకుండా నిలిచి ఉంటుంది.

---

గురయ్య వస్తున్నాడని ఇద్దరూ ఆంజనేయస్వామి రాతి విగ్రహం వెనక దాక్కున్నారు. గురయ్యను ఎట్లాగన్నా తప్పించుకోవాలని, ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటూ, గురయ్య అడుగుల చప్పుడు పసి కడుతూ నిలుచున్నారు. గురయ్య లోపలికి వచ్చి కనిపెట్టి, కృష్ణప్పను తిట్టి తన్ని ఎత్తుకోబోతే తన్నింది. అమ్మ నిద్రనించి లేపి "ఏమిటే అట్లా తన్నుతున్నావ్?" అంది.

తరవాత రెండు నెలలకే నాన్నగారికి ప్రమోషన్ మీద బదిలీ. విశాఖలో ఉండే రోజుల్లో బీచ్‌కి వెళితే కృష్ణప్పే ఆ కెరటాల్లో కనిపించేవాడు. పదేళ్ల వయసుతో, వెడల్పాటి ముఖంతో, పొడుగాటి ఎత్తయిన ముక్కుతో, గుండ్రని కళ్ళతో, విశాలమైన నుదుటితో, కళ్లమీద సదా పడే జుత్తుతో, వివేకమైన వ్యూహాలు పన్నే ఆలోచనలతో, ఆగని కెరటాల్లాంటి నవ్వుతో కనబడేవాడు. శ్రీకాకుళంలో ఉండే రోజుల్లో నాగావళి చూసినా కృష్ణప్పే కనబడేవాడు. ఏ ఊరు వెళ్లినా అక్కడి చెరువు, వాగు , నది, జలపాతం—

కళావతి అమాయికమైన కబుర్లేవో చెబుతూనే ఉంది. పార్వతి యాంత్రికంగా ఊకొట్టుతూనేఉంది. కాని తన స్వంతమయిన ఊహల్లో ఎక్కడో ఉంది.

పార్వతిని అక్కడ టీచర్‌గా వేసినతరవాత ఆ బడిలోని ఆడపిల్లలందరికీ ఎంతో గర్వం అనిపించింది. ఆ ఆడపిల్లల ఊహలు తామూ ఉపాధ్యాయినులుగా మగపిల్లలముందు నిలుచుని పాఠాలు బోధిస్తున్నట్టు పెరిగాయి. పార్వతితో వారికి చనువు హెచ్చింది. డిజైనులూ, కుట్లులూ, వంటలూ, ముగ్గులూ నేర్చుకోవడంకోసం రాసాగారు ఒక్కోసారి వాళ్లకు మేడమ్ పెళ్లి ఎందుకు చేసుకోలేదో అని సందేహం కలిగేది. కాని టీచర్ని అడిగే ధైర్యం లేదు. ఇంకా కొత్త. అంత చనువు లేదు. పైగా పార్వతి హుందాతనం అట్లాంటిది.

ఓ రోజు సరస్వతి అడగనే అడిగింది. సందర్భం అనుకూలించింది. సావిత్రి మేడమ్‌తో అంది—"కళావతికి సంబంధాలు వస్తున్నాయండీ. వాళ్ల అమ్మగారేమో పెళ్లికి తొందరచేస్తూంది" అని.

"అయితే కళావలీ, ఇంక నీ చదువు లింతేనా?" అని పార్వతి అడిగింది.

"చేసుకోను, మేడమ్. ఇష్టం లేదు" అని చెప్పింది కళావతి.

"ఏం, ఎందుకని?" అని పార్వతి అడగడం అదును తీసుకుని—

---

'శ్రీపతి'

11—1—67

"మీరు ఇంత పెద్దవాళ్లుగదా, ఎందుకు చేసుకోరు, మేడమ్?" అని సరస్వతి అడిగేసింది.

ఇంకొకరయితే ఆ ప్రశ్న తప్పించుకోలేరు. పార్వతి తన సహజమయిన గంభీరతతో "పిచ్చిప్రశ్న" అని నవ్వేసింది.

అదే ప్రశ్న మళ్లీ హెడ్మాస్టరు భార్య సరోజినీదేవి అడిగారు. గాయం తగిలినట్టయింది పార్వతికి. కాని తెలివిగా "వివాహయోగం రావాలి కదండీ" అని తప్పించుకుంది.

—జైపూర్ స్మృతి...

కొండలూ, చుట్టూ పొలాలూ, దగ్గరలో నదీ, అమాయికమైన ఒరియా ప్రజల మంచితనం, తోటతో తమ అద్దెఇల్లూ—అక్కడ చిన్నన్నయ్య ఇంగ్లీష్ లెక్చరర్‌గా ఉండేవాడు. సెలవుల్లో రమ్మని రాశాడు. మోహన్‌ను వెంటబెట్టుకుని వెళ్లింది. అక్కడే మిత్రా పరిచయం. మేథ్స్ లెక్చరర్. మిత్రా ఒరియా, కోరాపుట్ ప్రాంతీయుడు. తెలుగు వచ్చు. సంగీతం అంటే అపరిమితమైన ఇష్టం. త్యాగరాజ కృతులు కూడా నేర్చుకున్నాడు. ఎప్పుడు మాటాడినా సంగీతమే, బీతోవెన్ మొదలుకొని రవిశంకర్‌వరకూ. రబీంద్ర సంగీతాన్ని పరిచయం చేసింది మిత్రాయే. పాల్‌రోబ్సన్ సంగతి మిత్రావల్లే తెలుసుకుంది. తరవాత కాలేజీ చదువు మిత్రానించి దూరంచేసింది. మొన్నటిసారి అన్నయ్య వచ్చినప్పుడు మాటల సందర్భంలో మిత్రా ఢిల్లీలో ఉన్నట్టు చెప్పాడు.

ఎక్కడో కొమ్మమీద నిట్టూర్చింది ఓ పిట్ట.

కాలిబాట వంపు తిరిగింది.

అమ్మ తను ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యాక పెళ్లి చేసెయ్యాలంది. తను అంగీకరించలేదు. తండ్రీ సమ్మతించలేదు. కూతుర్ని పెద్దచదువులు చదివించాలనుకున్నాడు. తరవాత జీవితం దారి తప్పిపోయింది.

సుందరరావు—

పెద్దన్నయ్య వద్దకు హైదరాబాదు వెళ్లింది. పంజాగుట్టలో ఉండేవారు. రెండో వాటాలో సుందరరావు పరిచయం అయ్యాడు. పేరున్న చిత్రకారుడు. నటుడు. రంగులకూ రేఖలకూ అర్థం చెప్పాడు. దానితో ప్రతి రాయీ అహల్యలా కనబడింది. సెలవుల ప్రవాహం ఇంకిపోయింది. పడవ ఇసకలో కూరుకుపోయింది.

మనసు నిండా నీడలు అల్లుకున్నాయి.

రాధాకృష్ణ, కాలేజ్‌మేట్... మరీ చిన్నకళ్లు, అపీలోతు. ఖరీదయిన దుస్తులు వేసుకునేవాడు.

మోటార్ సైకిల్ కృష్ణమూర్తి — రాక్షసిలాంటి ఆకారం.

ఎదరింటి అబ్బాయి టాగోర్ — ఆడవారిగొంతు. ఎప్పుడూ కిటికీకి ముఖం అంటుకొని ఉండేది.

రచయితనని పరిచయం చేసుకున్న మేడమీది గదిలోని శాంతి — ఎప్పుడూ స్వీయస్తుతి, స్వోత్కర్ష.

నాన్నగారి ఆఫీసులో టైపిస్ట్ మురళి — పాత చింతపండులాంటి నలుపు.

గుంటూరులో పిన్నిగారి పక్కవాటాలోని జూనియర్ ఇంజనీర్ రామనాథం — ఎముకల గూడు. దానికి తోడు నత్తిపాపం!

జానకీరాణి అన్నయ్య శ్రీధరరావు — ఎప్పుడూ పరీక్షలు తప్పేవాడు. ఆదర్శాలు చెప్పేవాడు.

చివరికి ఈనాడు మేథ్స్ అసిస్టెంట్ ప్రకాశం —

# వైద్య విశేషాలు

**మిరియాలను** నిత్యాహారంలో విరివిగా ఉపయోగించటంవల్ల రక్తప్రసరణ సంబంధమైన వ్యాధులు దరికి రావని, అకాలమరణాలకు కారణమైన థ్రాంబోసిస్, ఎంబ్లాయ్ (రుధిర గ్రంథులు ఏర్పడటంవలన సంభవించేది) లను నిరోధించే సహజమైన ఔషధగుణం వాటిలో కలదని జర్మన్ శాస్త్రవేత్త డాక్టర్ గ్లాట్జెల్ ఋజువు చేశారు. అందుకే మిరపకాయలకు బదులు మిరియాలను విరివిగా వాడిన మన పూర్వులు నేటితరంవారిలా రక్తప్రసరణ వ్యాధులకు లోనుగాక, సంపూర్ణారోగ్యంతో నూరేళ్లు జీవించగలిగారు.

● ● ●

**బస్తీల్లో** నివసించేవారిలో పదిశాతం, జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఉదరానికి, ఆంత్రమూలానికి సంబంధించిన వ్రణాలతో బాధపడటం సహజమని; అకాలభోజనం, కల్తీ ఆహారం అందుకు కారణాలని శాస్త్రజ్ఞులు వెల్లడించారు.

● ● ●

**'గుర్రం'** ఎక్కినవారికి దిగటానికి వైద్య ప్రపంచం 'ఎక్స్' అనే చిట్కా కనుగొన్నది. మద్యం పుచ్చుకోబోయేముందు దీన్ని సేవిస్తే మత్తు, తూలుడు, పేలుడు, వాగుడు వంటి వికారాలేమీ కలగవు. నిషాలో ఉన్నవారికిఇస్తే కైపు దిగజారిపోతుంది.

● ● ●

**గర్భవతుల** రక్తంలో రెసిస్ ఫాక్టర్ లోపించినపుడు, శిశువు గర్భంలోనే మరణించటం జరుగుతుంది. సకాలంలో గర్భస్థ శిశువుకు రక్తాన్ని ఇవ్వగల్గితే, శిశువు కోలుకొని సజీవంగా జన్మిస్తుంది. ఇటీవల జర్మనీలో క్లిష్టమైన శస్త్రచికిత్సద్వారా గర్భస్థశిశువుకు రక్తం ఇవ్వటం, కృత్రిమ విధానంలో ప్రసవాన్ని కలిగించి శిశువు సజీవంగా జన్మించేట్లు చెయ్యటం జరిగాయి. అంతేకాదు, అటువంటి క్లిష్ట పరిస్థితులు ఏర్పడకుండా ముందుగానే జాగ్రత్తపడటానికి, రెసిస్ ఫాక్టర్ లోపానికి కారణమైన ఆంటీబాడీస్ (మాలిన్యాలు) లను నిరోధించే 'ఆంటీ—డీ—గామా—గ్లోబ్యులైన్' అనే ఔషధాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

● ● ●

**కాఫీకాని,** కెఫీన్ ద్రవ్యంగల ఏ ఇతర పానీయాల్నిగాని తాగవద్దని గర్భవతులను జర్మన్ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. కెఫీన్ ద్రవ్యానికి స్త్రీ జీవకణాలలోని క్రోమోజోమ్స్‌ను నశింపజేసే దుర్గుణం ఉన్నదని ప్రయోగాలు ఋజువు చేశాయి.

—యు. పి. ఎస్.—డాడ్

అనవసరంగానన్నా మాటలు కల్పించి—

తన స్వభావానికీ, ఆశలకూ సరిపడని, రాజీపొందని గుణాలు ఎదురయ్యాయి. రాధాకృష్ణలో భాగ్యవంతుడిననే గర్వం — తరవాత తరవాత ఇంకొకర్ని ... కృష్ణమూర్తిలో అతివాగుడులో — తన భర్త వీధిలో నలుగుర్లో మాటలు పారేసుకుంటే? టాగోర్‌లో కృతకమైన అలంకరణ. మురళిలో పిరికితనం. అల్పుడనన్న భావం — ప్రతి వెధవకీ జోహూకుం చేసే స్వభావం. రామనాథంలో ఛాందసభావాలు—ఇల్లు ఇరకటం ఇల్లాలు మరకటం కావాలంటే? శ్రీధర రావులో పరాజయం — శ్రీరంగనీతులు చెప్పడం, దొమ్మరి గుడిసెల్లో. ప్రకాశం అనవసరంగా జోక్యం చేసుకునే మనిషి.

ఆంజనేయస్వామి గుడి కోనేటి గట్టుమీద కన బడుతూంది. రావిచెట్టు పచ్చగా విందుగా ఉంది. పాత స్నేహితుల నందరినీ అక్కడే చూడబోతున్న ఊహలతో నడుస్తూంది పార్వతి. ఆమె జ్ఞాపకాలకూ, ఆలోచనలకూ మధ్య ఆ దృశ్యం అడ్డుగోడ నిలిపివేసింది.

కళావతిని గురించి పార్వతి ఆలోచించింది.

'మంచి సంబంధం అనిపిస్తే పెళ్లి చేసుకోవడం మంచిది, కళావతీ' అని చెప్పాలనుకుంది పార్వతి. అంత లోనే పెళ్లివిషయంలో సలహాలివ్వటం తెలివితక్కువ తనం అనిపించింది. తలిదండ్రులు చేసిన సంబంధాలంటే ఆమెకు అయిష్టం. అందుకనే మెడిసిన్ చదువుతున్న మూర్తి పెళ్లిచూపులకు వస్తే అన్నీ నచ్చినా కూడా ఇష్టపడలే దామె. అప్పట్లో పార్వతికి ఓ స్థిరమైన అభిప్రాయం ఉంటూ ఉండేది, జీవితంలో పరిచయమున్న వ్యక్తిని చేసుకోవాలని. అది తప్పు ఆలోచనేమో అనిపిస్తుంది. జీవితం ఆమెను వేధించే సమయాల్లో 'బహుశా భవిష్యత్తులో మంచి జరగవచ్చు. అంతా మన మంచికే' అని సంతృప్తి చెందేది. భానుమతి భర్తను కోల్పోయినప్పుడు, సుశీల గర్భంలోని బిడ్డతో ఆసుపత్రిలో చనిపోయినప్పుడు, యామిని నిప్పంటించుకుని కాలిపోయినప్పుడు పార్వతిలో ఆకాశంలా వ్యాపిస్తున్న అశాంతికి కొంత ఊరట కలిగేది. నిరాశల నిప్పులమీదనించి నడుస్తున్న సమయంలో, 'రేపు మంచి జరగవచ్చు' అనే ఆశల వర్షం ఎంతో ఓదార్పు ఇచ్చేది.

ఆశ నిరాశ రెండు కళ్లు. ఒక్కో కన్నుతోగాక రెండు కళ్లతోనూ చూస్తే ఆనందం, ప్రేమ, తృప్తి, బాధ, మమత, సౌందర్యం, మంచి, ఆశ, చెడు — ఇవన్నీ కేవలం కల్పితాల్లాగ ఉండేవి ఆమెకు.

యామిని ఎందుకు ఆత్మహత్య చేసుకుందో పార్వతికి తెలీదు. పూజించిన మనుషులే తరవాత ఎందుకు శపిస్తారో అర్థం కాదు. కావాలి, కావాలి అనుకున్న జీవితం ఎందుకు అంతలోనే విషం, రోత, చీకటి, దయ్యం అయిపోతుందో అవగాహన కానేకాదు. తెలీదు, తెలీదు అనుకుంది పార్వతి. నిన్నగురించి ఆమెకు తెలీదు. అది చీకటయిపోయి ఇంకిపోయింది. రేపు గురించి ఆమెకు తెలీదు. అది దూరంలో కాంతి తెరల వెనక ఉంది. ఈ దినాన్నిగురించి ఆమెకు తెలీదు. ఇక్కడ ఇట్లా నడుస్తుందని ఆమె అనుకోలేదు.

ఊరు చేరిపోయారు.

అస్థిపంజరంలా ఉంది ఊరు. అందమయిన యౌవనంలో ఉన్న ఊరు ఈ రకంగా తయారయింది. ఇళ్లు చాలావరకు కూలిపోయి మొండిగోడలు కనపడుతున్నాయి. పాతిక మగ్గాల మోత వినిపించడమే లేదు. పిల్లలూ పీచికలూ నిండా ఉండీ, మనుష్యులతో కలకల్లాడే ఊరు అక్కడ అక్కడ అర ఒకటిగా ఉన్న ఇళ్లతో, ఇది తను అనుకున్న ఊరేనా అన్న ఆశ్చర్యాన్ని కలిగించే స్థితిలో చూసి పార్వతి ఆశ్చర్యపోయింది.

వాళ్లంతా, తనతో ఆడుకున్న వాళ్లంతా ఏమయ్యారు?

కన్నప్ప నాన్నమ్మ ఉండేది. తన్ని ఎంతో ముద్దు చేసేది. వాళ్లకు చాలా ఆవులూ గేదెలూ ఉండేవి. వెన్న పెట్టేది. సీతమ్మత్త ఇంటికి తీసుకు వెళ్లి జామపళ్లూ, రేగుపళ్లూ, మామిడిపళ్లూ ఇచ్చేది. అనూవాళ్ల పెద్దక్క తాము బదిలీ అయి వెళ్లిపోతూంటే కంట నీరుపెట్టి ఏడ్చింది. లోలాక్షి పెళ్లి చేసుకుందా? వెళ్లిపోయేనాటికి రమణతో మాటల్లేవు. ఎక్కడుందో?

వీథిలోంచి నడుస్తున్నారు.

పార్వతికి అనిపించింది. ఈ ఊళ్లో చెట్లూ, కోనేటి గట్టూ, ఆంజనేయస్వామి గుడీ, రావిచెట్టూ — ఒక టేమిటి—పేరుపెట్టి పిలిస్తే ప్రతిదీ పలికి తీరవలసిందే! అలాంటిది, అంతా మూగగా మౌనంగా శాప గ్రస్తంగా ఉండడం బాధ అనిపించింది.

"అదే మా ఇల్లు, మేడమ్."



ఆకలి బాధ

చిత్రం—పి. ఎస్. చందర్ శేఖర్ (సికిందరాబాదు)

పార్వతి చూసింది.

ఆ ఇంటిలోనే తాము అద్దెకు ఉండేవారు. అప్పుడు ఆ ఇంటి యజమాని టాటానగర్‌లో ఉంటూ ఉండేవాడు. ఆయనే కళావతి నాన్న. తరవాత ఆరోగ్యం చెడిపోవడంతో వచ్చేశాడు స్వగ్రామం.

ఆ ఇల్లు చాలా మారిపోయింది ఇప్పుడు.

పెరటిలో తులసికోట ఉంటుంది.

తనూ కృష్ణప్పా నాటిన జామ మొక్క పెద్దదయి ఉంటుంది.

కళావతి తలిదండ్రులు, అక్క ఎంతో ప్రేమతో పలకరించారు. టిఫిన్ పెట్టారు. టీ ఇచ్చారు.

కళావతి అక్క ఉయ్యాల్లోని పాప ఏడవడంతో తీసి, పాలిచ్చి ఓదారుస్తున్న దృశ్యం పార్వతిని ఆకర్షించింది. ఆ చిట్టిపాపను గురించి అమ్మమ్మ, తాత, కళావతి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎత్తుకోవటానికి పిలుస్తున్నారు. ఆ పాప తల్లిని విడవటం లేదు.

పార్వతికి ఆ దృశ్యంతో జీవితంమీద మధురమైన కోరికలు రెచ్చిపోయాయి. వారం దినాలలో ఆమె భర్తకు దగ్గిరికి వెళ్లిపోతూందిట. వాళ్లాయనకు రైల్వేలో చిన్న ఉద్యోగంట. కాన్పుకు వచ్చి పదిమాసాలయిందిట! పాప ముద్దుగా ఉంది.

"అన్నీ వాళ్ల నాన్నగారి పోలికలే!" అంది కళావతి అక్క, ఆ పాపను గురించి పార్వతితో చెబుతూ.

ఆ మాట పార్వతి గుండెల్లో, గుండెలు నిండిపోయి నంత తేనె పిండి పోసింది.

పెరట్లోకి తీసుకువెళ్లింది కళావతి అక్క.

మొక్కలు లేవు. వంటిల్లు తయారయింది.

మిత్రా, సుందర్రావు, రాధాకృష్ణ, కృష్ణమూర్తి, శాంతి, టాగోర్, మురళి, రామనాథం, శ్రీధరరావు, చివరికి ప్రకాశం అంతా ఆమె కళ్లముందు కదిలారు. ప్రపంచంలో ఏ శక్తి ఈ అనురాగ వల్లరులను తెంచి వేస్తూందో! లేకపోతే ఒక్కొక్కరిలో ఆ చెడు అంత తొందరగా ఎందుకు చూపించాలి భగవంతుడు! లేక అనవసర విషయాలకు ప్రాధాన్యం ఇచ్చి తను మనసు పాడుచేసుకుంటున్నదా? మట్టిబొమ్మను పట్టుకుని, "మాధవా, మాధవా" అని పిలిచి, పలక్కపోతే అమాయికమైన వేదనతో కృశించిపోతున్నదా? నిజంగా ప్రపంచంలో ఏమీ లేదేమో! అంతా కల్పితమేనేమో! ఆ కల్పితాల్లోనే ఈ లోకం ఇంత రుచి కాబోలు! లేకపోతే ఉన్నట్టే ఉండి తన కళ్లలో కదిలి, ఊసులాడి, మళ్లీ మాయమైపోవడ మేమిటి? అదృశ్యంచుకోవడ మెందుకు? శర్మ, రమణ, కన్నప్ప నాన్నమ్మ, సాంబయ్య, లోలాక్షి, ఇంకా...ఇంకా...వాళ్లంతా ఏమయిపోయారు? ఆ జామ మొక్క ఎందుకు పీకి పారేశారు?

గతంలోని దృశ్యాలు అల్లుకున్నాయి. ముళ్లు పడ్డాయి. ఆమె మనసు పగిలిన అద్దంలో కనిపించిన బింబాల్లా కనిపిస్తూంది.

కళావతి తల్లి కూతురు పెళ్లి విషయం అడిగితే, "అమ్మాయికి ఇష్టమయితే చేసెయ్యడం మంచిది" అంది. తన సలహా తనకే నచ్చలేదు. తండ్రి ఆ అమ్మాయి చదువు విషయం అడిగితే, "తెలివైంది, పెద్దచదువులు చదివించండి" అంది. పరస్పరం విరుద్ధంగా మాటాడుతున్నట్టుకూడా ఆమెకు తెలియలేదు.

సాయంత్రం రంగులు కురుస్తూంది.

వేళ అవుతూందని బయలుదేరింది పార్వతి. ఇంటిల్లిపాది సాగనంపటానికి ఊరు అవతలివరకు వచ్చారు. ఊళ్లో నడుస్తున్నంతసేపూ పార్వతి కాళ్లు వణికాయి. ఆమె చూడాలనుకున్న అందాలు ఆమెకు కనిపించలేదు. ఎన్నో పూలు కోసుకుందామని ఆమె వచ్చింది. కాని, ఎడారి ప్రత్యక్షమయింది.

"ఈ నూలు మిల్లులు వచ్చిం తరవాత, సాలీలంతా తిండికి దొరక్క, అప్పులు చేసేసి, ఇళ్లూగట్రా అమ్మేసి భిలాయ్, రూర్కేలా, కలకత్తా, షిల్లాంగ్ వెళ్లిపోయారు." కళావతి నాన్నగారు కబుర్లు చెబుతున్నారు. కాని, పార్వతి వినిపించుకోవటం లేదు.

'ఇక్కడ ఆడుకునేవాళ్లం. మీ ఇంట్లోనే అద్దెకున్నాం. ఇప్పుడు ఈ ఊరు ఇలా పాడయిపోయిందేం? ఈ ఊళ్లో జనమంతా ఎక్కడికి వెళ్లిపోయారు?'

ఆ సందేహాలన్నీ ఆమె నాలిక చివరలోనే ఉన్నాయి.

ఆంజనేయస్వామిని చూసింది. పసుపుతో, సిందూరంతో అందంగా ఉన్నాడు స్వామి. తన్ని పదిహేనేళ్ల క్రితం ఎట్లా చూసేవాడో ఇప్పుడూ అట్లానే చూస్తున్నాడు. తన్ని గుర్తుపట్టిన చూపు. పలకరించిన ప్రేమ ఆ కళ్లలో. చేతులెత్తి వందనం చేసింది. ఆ వందనంలో ఆమె కృతజ్ఞత ఉన్నాయి. తన్ని ఆంజనేయస్వామి గుర్తుపట్టాడన్న ఆనందానికి కృతజ్ఞత అవి.

అప్పుడే వచ్చిన గాలి కెరటానికి రావిచెట్టు తల ఊపింది.

కోనేరు!

కోనేరు పిలుస్తూంది. అలలు సైగచేసి—

కృష్ణప్ప....కృష్ణప్ప....

మునుగుతూ తేలుతూ, మునుగుతూ తేలుతూ ...

దూదిపింజలా మనసు తేలిపోతూంది.

అలిసిపోయింది గుండె. నరాలన్నీ తెగిన తీగల్లా వణికిపోతున్నాయి. 'కూర్చోకపోతే పడిపోతానేమో!' అన్న అనుమానంతో కూర్చుంది రావిచెట్టు వేరుమీద.

పార్వతికి గుడి గోడలమీద గీసిన బొమ్మలూ, అక్షరాలూ చిత్రంగా కనిపిస్తున్నాయి. ఆ గుడికి వెళ్లవేసి ఒక తరం గడిచిపోయినట్టుంది. ఎత్తుగా కొమ్మకు ఆనుకొని ఉన్న గోపురానికి కిందుగా పార్వతి అనే అక్షరాలు కనిపించాయి. కృష్ణప్ప కనపడ్డాడు. కృష్ణప్ప వర్షం వెలిసిన రోజున కొమ్మమీద కూర్చుని చెక్కాడు. ఆకుల మీదనించి చినుకులు జారుతూండేవి కృష్ణప్పమీదా, తన మీదా. తను కిందనుండి చూసింది. నవ్వుకున్నారు.

ఆ అక్షరాలు యుగయుగాల నిరీక్షణతో చూస్తున్నాయి. అనేక అదృశ్యహస్తాలతో పిలుస్తున్నాయి. మూగగా అనంతమయిన ఆవేదనతో ప్రార్థిస్తున్నాయి.

పార్వతి చూపులు వింతగా ఉన్నాయి.

చీకటి పడేసరికి ఇల్లు చేరుకుంది. కళావతి నాన్నగారు తోడుగా వచ్చారు.

ఆమెకు ఆ రాత్రి తిండి సయించలేదు.

'లేదు. ఇంతకాలమూ నేను ఆత్మవంచన చేసుకున్నాను. నాకు తెలీదు. స్వామీ, నువ్వు సాక్షివి. నేను వివాహితను' అని ఆమె మనస్సులో మూగగా చెప్పుకుంది, నిద్రపోయేముందు.

తరవాత ఆమెకు నదులూ, వాగులూ, చెరువులూ, కాలవలూ, జలపాతాలూ గుర్తుకు వచ్చాయి. ★



## పురవీథుల్లో పులి

హాంబర్గ్ పురవీథుల్లో పౌరులతోబాటు ఒక పులికూడా ఇటూ అటూ షికార్లు చేస్తున్నది. అది సర్కస్ కంపెనీవారి పులి. దాని పేరు బెంగాల్. దానికి రోజూ షికారు చెయ్యటం అలవాటు. సర్కస్ కంపెనీ ప్రచారం పులి అలవాటువల్ల జరుగుతుందని దాని శిక్షకుడు, ఆయన భార్య దానిని వెంటతీసుకుని వీథుల్లో షచార్లు చేస్తున్నారు. "ఎంత పెంపుడు పులి అయినా అది క్రూరజంతువే. దానిని నమ్మటం ఏమిటి?" అంటూ పౌరులు కొంచెం దూరంగానే నడుస్తున్నారు.

(యు. పి. ఎస్.—డాడ్)